# లోక్‌సత్తా 2.0

LOKSATTA
*people power*

**మీడియా ప్రకటన**

(హైదరాబాద్, 07/10/2017)

# 'పెట్రో బంకుల్లో అక్రమాలపై లోటాలు, టిష్యూ కాగితాలతో పోరాడండి'
# సురాజ్య యోధుల తొలి పోరాటాన్ని వెబ్ ద్వారా ప్రారంభించిన జేపీ

పెట్రోలు బంకుల్లో జరుగుతున్న కొలతల అక్రమాలు, కల్తీల వల్ల తెలుగు రాష్ట్రాల్లో రోజుకు రూ.6కోట్లు వాహనదారులు నష్టపోతున్నారని, ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు రూ.1.5కోట్లు జేబులకు చిల్లుపడుతోందని, దీనిపై యువత, ఇతర వాహన యజమానులు ఖర్చులేని లీటరు క్యాన్లు, టిష్యూ కాగితాలతో పోరాడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

**ఈతరం వినూత్న ఉద్యమంగా, పార్టీలకతీతంగా చేస్తున్న 100 రోజుల 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' వెబ్ ప్లాట్‌ఫారాల ద్వారా ఇప్పటివరకూ నమోదైన కార్యకర్తలతో తొలి కార్యక్రమాన్ని జేపీ శనివారం హైదరాబాద్‌లో వెబ్ ద్వారా ప్రారంభించారు. వివరాలను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.**

పెట్రోలు బంకుల్లో కొలతల అక్రమాలు, కల్తీలపై ఖర్చు లేకుండా, తేలిగ్గా ఎలా పోరాడాలో క్యాన్లు, టిష్యూ కాగితంతో ఈ వెబ్ సమావేశంలో జేపీ వివరించారు. తాము తెచ్చిన లీటరు, ఐదు లీటర్ల లోటాల్లో పెట్రోలు పోయాలని వారానికి ఒక్కసారైనా పెట్రో స్టేషన్లలో అడగటం మొదలుపెడితే ప్రజలకు ఏటా కొన్ని వేల కోట్ల డబ్బు ఆదా అవుతుందన్నారు. దీన్ని జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కొన్ని బంకుల్లో తాను కూడా పాల్గొంటానని తెలిపారు. ఇలా చాలా తేలిగ్గా ప్రతి ఒక్కరూ తమ పరిధిలో చేయగలిగిన చిన్న కార్యక్రమాలతో పెద్ద ఫలితాలను సాధించాలనే లక్ష్యంతోనే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు. పెట్రో బంకుల్లో అక్రమాలపై లోక్‌సత్తా 1998లో తొలిపోరాటం చేసినప్పుడు కొన్నేళ్లపాటు వాటికి అడ్డుకట్టపడి ప్రజలకు డబ్బు ఆదా అయిందని, ప్రజల చొరవ తగ్గటం, అధికారుల నిఘావైఫల్యంతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చిందని అన్నారు. అప్పట్లో కంటే ఇప్పుడు బంకులు, వాహనాలు పెరగటంతో దోపిడీ భారీగా పెరిగిందని, గతంలోని పొరపాటు జరగకుండా ప్రజలు తేలిగ్గా, నిరంతరం భాగస్వాములయ్యేందుకే వెబ్ ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్'లలో నమోదై ఈ కార్యక్రమాల్లో యువత, ఇతర ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## 9 నుంచి విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో
## 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర అక్టోబర్ 9 నుంచి 17 వరకు విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జరుగుతుంది.

9, 10, 11 తేదీల్లో విజయనగరంలో, 11వ తేదీ మధ్యాహ్నం నుంచి 14వరకు శ్రీకాకుళం జిల్లాలో, అక్టోబర్ 15 నుంచి 17 వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో జేపీ సురాజ్య యాత్ర నిర్వహిస్తారు. విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, చట్టబద్ధపాలనతో అందరికీ సమన్యాయం, జనం ఉండే చోటనే స్థానికంగా అధికారాలు, వ్యవసాయంలో ఆదాయం.. అనే 6 అంశాలపై యువత, రైతులు, దగాపడ్డ దళితులు-పేదలు, మధ్యతరగతివర్గాలతో జేపీ మమేకమై సమస్యల్ని చర్చిస్తారు. ప్రభుత్వం వెంటనే అమలు చేయగల పరిష్కారాలను రూపొందించి ప్రజల భాగస్వామ్యంతో సాధించేందుకు కృషిచేస్తారు. దీర్ఘకాలంలో కూడా యువత, ఇతర ప్రజలు అవగాహనతో, ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారంలో భాగస్వాములయ్యేందుకు వీలుగా వెబ్ వేదికల ద్వారా జేపీ అందుబాటులో ఉంటారు.

Join & Participate: www.youthforbetterindia.com

**లోక్‌సత్తా**

Flat No. 801 & 806, Srinivasa Towers, Besides ITC Kakatiya Hotel, Begumpet, Hyderabad- 500 016
Tel: 91-40-23419949; Fax: 23419948 email: info@fdrindia.org; www.fdrindia.org